పేదల ఆరోగ్యానికే సురక్ష

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- సేవలు అందించిన వైద్య నిపుణులు

దేవరపల్లి: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని చిన్నాయ గూడెం జెడ్పీ హైస్కూల్ వద్ద శనివారం ఏర్పాటు చేసిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నాలుగు వార్డులు ఏర్పాటు చేసి రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ డి.జ్యోతిరాణి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే తలారి మాట్లాడారు. ఐదు దశల్లో మొత్తం 45 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, మండల ప్రత్యేకాధికారి రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

నల్లజర్ల: పుల్లలపాడులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం సాయంత్రం సందర్శించారు. శిబిరంలో జనరల్ మెడిసిన్ సేవలను డాక్టరు సునీల్‌కుమార్, గైనకాలజీ సేవలను డాక్టర్ అంజనీ శ్వేత అందించారు. అలాగే స్థానిక వైద్యులు తెల్లం గంగాధరావు, సిరాజుద్దీన్, ఆప్తమాలజిస్ట్ రాంబాబు, డెంటిస్ట్ రాజేంద్రప్రసాద్, కుష్ఠు వ్యాధికి మందులు ఇచ్చే ఎస్.మోషే పాల్గొన్నారు. మొత్తం 370 మంది రోగులు వివిధ రకాల వ్యాధులకు ఈ శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. శిబిరాన్ని పుల్లలపాడు పంచాయతీ సర్పంచ్ అల్లూరి సూర్యచంద్రరావు ప్రారంభించారు.

పెరవలి: కానూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు శనివారం ప్రారంభించారు. కాగా కానూరు వైద్య శిబిరంలో 423 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. మరిన్ని పరీక్షల కోసం ఆరోగ్యశ్రీ పథకంలో 43 మందిని ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేశామని కానూరు పీహెచ్‌సీ వైద్యురాలు బి. తేజశ్రీ తెలిపారు. శిబిరంలో ఎముకలు, డెంటల్, కంటి వైద్యులు కేవల్ పూర్ణిమ, షహానా అశోక్, పి ఉమాశంకర్, ఎస్ విజయశాంతి, హేమరాజులు రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షులు వీరమళ్ళు సత్యనారాయణ, పార్టీ నిడదవోలు మండల శాఖ అధ్యక్షులు అయినీడి పల్లారావు, నిడదవోలు, ఉండ్రాజవరం జెడ్పీటీసీలు కొయ్యే సూరిబాబు, భాస్కరరామయ్య పాల్గొన్నారు.

గోపాలపురం: చిట్యాల జెడ్పీ హైస్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు 350 మందికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, నాయకులు ఎస్‌కే వల్లీ, పీతల ప్రసాద్‌బాబు, పెనుగొండ బాలాజీ, ముచ్చికర్ల రవి, సర్పంచ్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: వాడపల్లి హైస్కూల్లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ ప్రారంభించారు. బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, మలేరియా, డెంగీ, క్షయ పరీక్షలు చేశారు. మొత్తం 634 మందికి వైద్య సేవలు అందించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, డీఎల్‌డీవో శాంతమణి, ఎంపీడీవో కె.సుశీల, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, సర్పంచ్ గెల్లా ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సంధ్య, దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు, పీపీ యూనిట్ వైద్యుడు బి.శ్రీనివాస్, ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డి.సునీల్, గైనకాలజిస్టు మనోజ్ఞ, దంత వైద్య నిపుణుడు రవితేజ సేవలందించారు.

నిడదవోలు రూరల్: విజ్జేశ్వరంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ తిక్కా శ్రీనివాస్ ప్రారంభించారు. ఆరోగ్య సిబ్బంది, వలంటీర్ల సర్వేలో గుర్తించిన రోగులకు స్పెషలిస్ట్ వైద్యులు పి.రవికుమార్, సీహెచ్ దివ్య, అనూహ్య విద్యాదేవి, రవి చైతన్య, రోజాలక్ష్మి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వెలగన పోలయ్య, కాపకాయల శ్రీను, కె.విజయ, ఎంపీడీఓ పి.శామ్యూల్, పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్

ఉండ్రాజవరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రారంభించారు. ఈ శిబిరంలో డాక్టర్ నజిలా (కంటి వైద్యం) డాక్టర్ రవిచావ్లా (ఎమర్జెన్సీ కేర్), డాక్టర్ రాజనాల ప్రసాద్, డాక్టర్ ఉషాదేవి (జనరల్) సుమారు 506 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అలాగే ఐసీడీఎస్ పెరవలి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, తహసీల్దార్ జి.కనకరాజు, ఎంపీడీవో గాదిరాజు రామకృష్ణంరాజు, సర్పంచ్ మెండే వెంకట్రావు, సీడీపీవో ఎం.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక వైద్యుల బృందం 511 మందికి వైద్య సేవలు అందించారు.


చిన్నాయగూడెంలో సురక్ష శిబిరంలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


పెరవలి మండలం కానూరు వైద్య శిబిరానికి హాజరైన రోగులు

క్లుప్తంగా

జిల్లాలో 386 'సురక్ష' శిబిరాలు

కొవ్వూరు: జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు శనివారం మండలంలోని వాడపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ సీహెచ్ నిర్మల గ్లోరీ కూడా వెంట ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తొలి రోజైన 383 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. వాటిలో 136 మంది ప్రత్యేక వైద్య నిపుణులు,109 మంది సాధారణ వైద్యులు సేవలందించారని వివరించారు.

రాష్ట్రస్థాయి లాంగ్ జంప్ పోటీలకు హసన్


హసన్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం కృష్ణకుమారి, ఉపాధ్యాయులు

నిడదవోలు: రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీలకు పట్టణంలోని ఎల్ఎల్ఆర్ మున్సిపల్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి ఎస్‌కే హసన్ ఎంపికయ్యాడు. పెద్ద తాడేపల్లిలోని భారతీ విద్యాభవన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శుక్రవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. నిడదవోలు నియోజకవర్గం తరపున ప్రాతినిధ్యం వహించిన ఎస్‌కే హసన్ లాంగ్ జంప్‌లో రెండో స్థానం, ట్రిపుల్ జంప్‌లో రెండో స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ప్రతిభ చూపిన హసన్‌తో పాటు అతడికి శిక్షణ ఇచ్చిన పీఈటీ విజయదుర్గను హెచ్‌ఎం కె. కృష్ణకుమారి శనివారం అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అఖిల్


అఖిల్

గోపాలపురం: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలకు మండలంలోని వేళ్ల చింతలగూడెం సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థి అఖిల్ ఎంపికయ్యాడు. ఆ స్కూల్ హెచ్‌ఎం సిస్టర్ సిల్పి ఆంథోనీ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. స్కూల్స్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్‌లో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో గోపాలపురం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన అఖిల్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆమె తెలిపారు. అఖిల్‌కు వాలీబాల్‌లో శిక్షణ ఇచ్చిన పీఈటీ యు సుమన్‌ను స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ ఎస్సీ జార్జీ అభినందించారు.

అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకువెళ్లాలి

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: జగనన్న ప్రభుత్వం చేస్తున్న అసలైన అభివృద్ధిని వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రతి ఇంటికీ తీసుకువెళ్లాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సూచించారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి? కార్యక్రమంపై నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పార్టీ మండలశాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎమ్మెల్యే తలారి మాట్లాడారు. ఈ కార్యక్రమం అక్టోబరు 11 నుంచి నబంబరు 11 వరకూ జరుగుతుందన్నారు. మొదటి రోజు సాయం 3 గంటలకు గ్రామ సచివాలయం వద్ద ప్రభుత్వ అధికారులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ మద్దతు దారులు, లబ్ధిదారుల ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గంటలకు సచివాలయం పరిధిలో పార్టీ జెండా ఆవిష్కరణ జరుగుతుందన్నారు. గ్రామ పెద్దలతో రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు రాత్రి భోజనం , రాత్రి బస ఉంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం 8 గంటలకు ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి? ఇంటింట ప్రచారం నిర్వహించాలని ఆయన సూచించారు. అక్టోబరు 11 నుంచి నవంబరు 11 వరకు వైఎస్సార్ సీపీ సచివాలయం శిబిరాలు నిర్వహి స్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యులు పొట్టి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

సీఎం మానస పుత్రిక సచివాలయ వ్యవస్థ

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- నడుపల్లిలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన, ఇళ్ల పట్టాల పంపిణీ

పెరవలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రిక అయిన సచివాలయ వ్యవస్థ ద్వారా పాలన మరింతగా ప్రజలకు చేరువైందని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని నడుపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన పలు అధికారిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో రూ.42 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.21.50 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని, రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ క్లినిక్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జలజీవన్ మిషన్ కింద రూ.65 లక్షల వ్యయంతో ఆ గ్రామంలో నిర్మించే వాటర్ ట్యాంక్‌కు శ్రీనివాస్‌నాయుడు శంకుస్థాపన చేశారు. అలాగే నడుపల్లి గ్రామంలోని జగనన్న కాలనీలో 75 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పలువురి లబ్ధిదారుల గృహాలకు స్వయంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన చేసిన సభలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడారు. ఇప్పటి వరకూ రూ.19 కోట్ల వ్యయంతో నడుపల్లి గ్రామంలో రోడ్లు, డ్రైన్లు, నూతన భవనాల నిర్మాణం వంటివి అభివృద్ధి పనులు చేశామన్నారు. గ్రామంలో అర్హులైన వారి ఖాతాలకు ఈ నాలుగున్నరేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.15 కోట్లను జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళు సత్యనారాయణ, పార్టీ గృహ సారథుల కన్వీనర్ రామడుగుల సూర్యనారాయణ, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్టి రాంబాబు, సర్పంచ్ బీరా సత్యవేణి రాజు, సొసైటీ అధ్యక్షులు కరుటూరి భాస్కరరావు, ఉప సర్పంచ్ రవీంద్రనాద్ చౌదరి, వెంకట రమణ, ఎంపీటీసీ సభ్యురాలు ఆకుల అనంత లక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


నడుపల్లిలో పేదలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

రూ.34 కోట్లతో సచివాలయ భవనాలు


ప్రభుత్వ భవనాల సముదాయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రూ.34 కోట్లతో 81 గ్రామ సచివాలయాలకు సొంత భవనాలు నిర్మించినట్టు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తెలిపారు. మండలంలోని దుద్దుకూరులో రూ.42 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్ర భవనం, రూ.26 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనాలను శనివారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన సంస్కరణల్లో ప్రధానమైనది గ్రామ సచివాలయ వ్యవస్థ అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతా నాగమణి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, సొసైటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సునీత కుమారి, నూతలపాటి చంద్ర, ఆచంట అనసూయ, కూచిపూడి సతీష్ పాల్గొన్నారు.

దూబచర్లలో 30 మంది రక్తదానం


శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎలైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల ఎలైట్ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ దూబచర్ల శాఖ, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంకు వారు ఈ శిబిరంలో 30 మంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. శిబిరం నిర్వాహకుడు అంబటి శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షుడు కెల్లా వాసు, కోశాధికారి నెక్కంటి వెంకటేష్, ఎలైట్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి, సర్పంచ్ తాడిగడప బాలయ్య, కార్యదర్శి బి.రత్నం, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ నల్లజర్ల శాఖ అధ్యక్షుడు ఎండీ షరీఫ్, సోమిశెట్టి వెంకట్రావు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డొస్తే సహించేది లేదు

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- మల్లేశ్వరంలో కొనసాగిన గడప గడపకూ..

పెరవలి: గ్రామాల అభివృద్ధికి ఏ పార్టీ వారైనా అడ్డంకిగా మారితే సహించేది లేదని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు హెచ్చరించారు. మండలంలోని మల్లేశ్వరం గ్రామంలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి రూ.వేలాది కోట్లు నిధులు ఇస్తోందన్నారు. అయితే విపక్షాల వారు అభివృద్ధికి అడ్డు తగులుతూనే ప్రజలు తిరగబడాలన్నారు. ఈ గ్రామంలో సుమారు రూ. కోటి వ్యయంతో వివిధ పనులు చేపట్టామని చెప్పారు. అలాగే సంక్షేమ పథకాల ద్వారా ఈ గ్రామ ప్రజలకు సుమారు రూ.2 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. ఇటువంటి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అందుతున్నాయా? లేదా అని అడిగారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళు సత్యనారాయణ, ఎంపీడీవో దామోదరరావు, సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల, సొసైటీ అధ్యక్షుడు బొలిశెట్టి బ్రహ్మానందం పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి పట్టాభి తదితరులు పాల్గొన్నారు.


మల్లేశ్వరంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

50 మంది టీడీపీ నేతలపై కేసు

దేవరపల్లి: పోలీసుల నిబంధనలను ఉల్లంఘించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన తెలుగుదేశం నాయకులపై దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై కె. శ్రీహరిరావు కథనం ప్రకారం మండలంలోని దుద్దుకూరు ప్రధాన రహదారిపై టీడీపీ శ్రేణులు శుక్రవారం రాత్రి ఆందోళన నిర్వహించారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో పాటు ప్రయాణికులకు ఆటంకం కలిగించినట్టు ఎస్‌ఐ తెలిపారు. మండలంలో అమలులో ఉన్న 144 సీఆర్‌పీసీ నిబంధనలను ఉల్లంగించారన్నారు. ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దిపాటి వెంకట్రాజు, పార్లమెంటరీ ఇన్‌చార్జ్ సిస్ట ల లోహిత్ ఆధ్వర్యంలో 50 మంది ఈ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి జగన్ పాలనపై విమర్శలు చేసి, కించపరిచేలా మాట్లాడారన్నారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారన్నారు.అంతేగాకుండా సీఎం పాడెను మోస్తూ దహన కార్యక్రమం చేసినందుకు 50 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె. శ్రీహరిరావు వివరించారు.

పట్టణాభివృద్ధే లక్ష్యంగా పాలన

- మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ
- నిడదవోలు కౌన్సిల్ సమావేశం

నిడదవోలు: బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ ఇప్పటి వరకూ పట్టణాభివృద్ధే లక్ష్యంగా మున్సిపల్ పాలక వర్గం పని చేస్తోందని చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం చైర్మన్ ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలోని ఏడు అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ నాడు-నేడు, రోడ్ల విస్తరణ, మాలకోడు మురుగు కాలువ, డంపింగ్ యార్డు ప్రక్షాళన, సీసీ రోడ్లు, డ్రైయిన్, రివర్స్ ఫ్రంట్ పార్కు నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు రూ.370 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. ఈనెల 16న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిడదవోలు పర్యటన విజవంతానికి కృషి చేసిన జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్ పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కమిషనర్ కేవీ పద్మావతి, టౌన్ ప్లానింగ్ అధికారి కె. సుప్రియ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఆదినారాయణ

పారిశుధ్య కార్మికులకు సత్కారం

నిడదవోలు: ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా పట్టణంలో అంకితభావంతో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న12 మంది కార్మికులను స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి అధ్యక్షతన చైర్మన్ భూపతి ఆదినారాయణ వారిని ఘనంగా సత్కారించి, సర్టిఫికెట్లు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కొవ్వూరు: మరమ్మతులకు గుర్రై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీ కొట్టింది. పట్టణ శివార్లలోని జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్‌పై శనివారం సాయంత్రం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఢీకొట్టిన లారీ క్యాబిన్ నుజ్జు నుజ్జయ్యింది. ఈ ఘటనలో ఢీకొట్టిన లారీ డ్రైవర్, క్లీనర్‌లకు తీవ్ర గాయ్యాలయ్యాయి. వారిద్దరూ క్యాబిన్‌లో చిక్కుకుపోయారు. రాజమహేంద్రవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డ్రైవర్ చనిపోయాడు. ఈ ప్రమాదంలో ఆగి ఉన్న లారీ వారికి చెందిన ఓ మోటార్ సైకిల్ కూడా పాక్షికంగా దెబ్బతింది. హైవే పెట్రోలింగ్ పోలీసులు అంబులెన్స్‌లో ఇద్దరు క్షతగాత్రులను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి, క్షతగాత్రుడి వివరాలు తెలియరాలేదు. కొవ్వూరు పట్టణ ఎస్‌ఐ బి. దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిడదవోలు: పట్టణ రైల్వే స్టేషన్ పరిధిలోని చిన కాశిరేవు వద్ద శనివారం గుర్తు తెలియని రైలు ఢీకొని సుమారు 35 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్సై జి.శ్రీహరి తన సిబ్బందితో వచ్చి రైల్వే ట్రాక్ మధ్యలో పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ఆరెంజ్ కలర్ చొక్కా , నీలం రంగు జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి ఎడమ వైపు వీపుపై దుర్గ అని, కుడి వైపు చాతీపై చిట్టి అత్తా అని, కుడి చేయి దండ వద్ద ఓం అనే పచ్చ బొట్లు ఉన్నాయి. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీకి తరలించారు. జీఆర్‌పీ ఎస్సై జి. శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుని వివరాలు తెలిసిన వారు 94906 17090, 70133 60296 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన కోరారు.